క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ధరూరు: మండల పరిధిలోని జెన్‌కో పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి రామ్‌చరణ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైట్లు పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం తెలిపారు. ఫిబ్రవరి 20 నుంచి 23 వరకు వికారాబాద్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొన్నున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని జెన్‌కో ఎస్‌ఈ శ్రీధర్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

26న అంతర్రాష్ట్ర భజన పోటీలు

ఎర్రవల్లి: మండల పరిధిలోని వేముల రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 26న మహాశివరాత్రి సందర్భంగా అంతర్రాష్ట్ర భజన పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ భజన మండలి సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన సభ్యులు ముందుగా రూ.400 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 96523 53506, 96520 03306ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మానవపాడు: అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను మండలంలోని జల్లాపురం గ్రామ శివారు ప్రాంతంలో బుధవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు. కర్నూల్ జిల్లా గార్లపాడు గ్రామ శివారు ప్రాంతంలోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్నా సమాచారం మేరకు తనిఖీ చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

26 నుంచి శివరాత్రి ఉత్సవాలు

ఎర్రవల్లి: మండల పరిధిలోని వేముల శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26 నుంచి 28 వరకు మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గట్టు: 132/33 కేవీ అయిజ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి 33కేవీ గట్టు, 33 కేవీ గొర్లఖాన్‌దొడ్డి ఫీడర్ల మధ్య 33 కేవీ లైన్ ఏర్పాటు నిమిత్తం విద్యుత్ సరఫరాలో గురువారం అంతరాయం ఉండనున్నట్లు ఏఈ చెన్నయ్య, లైన్‌మెన్ భీమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు పేర్కొన్నారు.

సరిహద్దులో ముమ్మరంగా తనిఖీలు

అలంపూర్: అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద పశు సంవర్ధక శాఖ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. బుధవారం పశుసంవర్ధక శాఖ అధికారులు శంకరయ్య, రమణమ్మ, మాసుం బాష తనిఖీలు చేపట్టారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కోళ్లు, కోడిగుడ్ల వాహనాలను తనిఖీలు చేసి వెనక్కి పంపుతున్నారు. కార్యక్రమంలో చెక్‌పోస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయ భవనం మార్పు

రాజోళి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని మరొక భవనంలోకి మార్చారు. గతంలో ఉన్న అద్దె భవనంలోనే కొనసాగుతుండగా ప్రత్యేక అవసరాల దృష్ట్యా భవనాన్ని వేరొక భవనంలోకి మార్చినట్లు అధికారులు తెలిపారు. మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు బుధవారం కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రజల గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అక్రమాలు

ఇటిక్యాల: ఉమ్మడి మండలంలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వరకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.3,97,58,510 పనులు జరిగాయి. సోమవారం ఉన్నతాధికారుల సమక్షంలో నిర్వహించిన ప్రజా వేదికలో ఉమ్మడి మండలంలోని 29 జీపీలకు గాను రూ.1,50,750 పెనాల్టీతో పాటు రూ.50,609 రికవరీ చేసినట్లు ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావేదిక క్షేత్ర స్థాయిలో సీసీ రోడ్లు, వైకుంఠధామాలు, కల్లాల నిర్మాణం, డంపింగ్ యార్డుల ఏర్పాటు, నర్సరీల నిర్వహణతో పాటు వ్యవసాయ సంబంధిత అభివృద్ధి పనులను చేపట్టడం వంటి పనుల్లో సామాజిక తనిఖీ బృందం అక్రమాలు గుర్తించినట్లు తెలిపారు. ఇందులో అధ్యధికంగా నక్కలపల్లి రూ.37,417తో పాటు అత్యల్పంగా ధర్మవరం రూ.300 జరిమాన విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆహ్లాదం.. బోర్డులకే పరిమితం

- నామమాత్రంగా పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు
- నిర్మించారు... నిర్వహణ గాలికొదిలేసిన అధికారులు
- ప్రజాధనం వృథా అంటున్న ప్రజలు


అమరవాయిలో నిరుపయోగంగా ఉన్న పల్లె ప్రకృతి వనం

మానవపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఆహ్లాదం కోసం ప్రతి గ్రామానికో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. ప్రకృతి వనాల్లో గ్రామాల ప్రజలు సేదతీరేందుకు, ఆహ్లాదాన్ని పంచాలన్నా ఉద్దేశంతో నిర్మించారు. కానీ నేడు వాటి నిర్వహణ భారంగా మారుతుంది. ఊరికి దూరంగా ఉండటంతో పల్లె పకృతి వనాల్లో అడుగుపెట్టే నాథుడే కరువైయ్యాడు. నీటి సౌకార్యం లేక నిర్వహన పట్టించుకునే వారే లేరు. మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా మారాయి. విద్యుత్ సౌకార్యం కల్పించాల్సి ఉన్నప్పటికి పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రజాధనం వృథాతో పాటు ఆహ్లాదం బోర్డులకే పరిమితమైందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

అధ్వానంగా నిర్వహణ..

మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనాల నిర్వహణ అధ్వానంగా ఉంది. పూలు, పండ్లు, ఇతర మొక్కలను పెంచి ఆహ్లాదకరమైన వాతవరణం ఏర్పాటు చేసే ఉద్దేశంతో నెలకొల్పగా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రకృతి వనాలు నిరుపయోగంగా మారాయి.

లక్షలు ఖర్చు పెట్టారు..

లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు ప్రారంభించారు. ఏదో మొక్కలు నాటామా..వదిలేశామా అన్నట్లు వ్యవహరించడంతో ప్రకృతి వనాల పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలోని రికార్డుల్లో ప్రకృతివనాలు కనిస్తున్నా... క్షేత్రస్థాయిలో మాత్రం మైదనాలుగా మారిపోయాయి. అధికారులు పర్యవేక్షణ కరువై, ప్రత్యేకాధికారుల పాలన గాలికి వదిలేశారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందని, రాజుల పైసలు రాళ్లపాలు అన్నట్లుగా పల్లె ప్రకృతి వనాల తీరు కనిపిస్తోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాలకు దూరంగా..

గ్రామ పంచాయతీ అధికారులు పల్లె ప్రకృతి వనాలను గ్రామాలకు దూరంగా, మురుగు కాలువల వద్ద ఏర్పాటు చేయడంతో పాటు నిర్వహణ లోపం కారణంగా నిరుపయోగంగా మారాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో నిధుల లేమి కారణంగా పంచాయతీ అధికారులు నిర్వహణ లేదంటూ అధికారులు చెబుతున్నారు. ప్రకృతి వనాల నిర్వహణకు వాటర్‌ట్యాంక్, మల్టీపర్పస్ వర్కర్లను నియమించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు అసలు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు కార్యాలయాలకే పరిమితిమై క్షేత్రస్థాయి పర్యవేక్షణ పూర్తిగా మర్చిపోవడంతో గ్రామాల్లో పంచాయతీల పాలన పట్టుతప్పుతోందని పేర్కొన్నారు.

నిర్వహణకు చర్యలు..



గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను పరిశీలించి నిర్వహణ కోసం చర్యలు తీసుకుంటాం. పరిస్థితి మెరుగుపడేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తాం. సాధ్యమైనంతవరకు త్వరగా పల్లె ప్రకృతివనాలు ఆహ్లాదంగా మార్చేందుకు కృషి చేస్తాం.

-భాస్కర్ ఎంపీడీఓ, మానవపాడు

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అలంపూర్: కేంద్రం ప్రవేశ పెట్టిన ఆర్థిక బడ్జెట్‌ను రైతులు, కార్మికులకు అనుకులంగా సవరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జీ రాజు, జీకే ఈదన్న డిమాండ్ చేశారు. అలంపూర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర ఆర్థిక బడ్జెట్‌పై సీపీఎం నాయకులు బుధవారం నిరసన వ్యక్తం ప్రతులను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని, ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి ప్రతిపాదనలు రూపొందించలేదన్నారు. వస్తువులపై విధిస్తున్న జీఎస్టీ ధరలు తగ్గించాలని, ధనవంతులకు ఇచ్చే రాయితీలను తగ్గించాలని, స్కీమ్ వర్కర్లకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, దేశంలో 40 కోట్ల మంది ఉపాధి కూలీలు ఉన్నారని, వారికి బడ్జెట్‌లో రూ.రెండున్నర లక్షల కోట్లు కేటాయించాలని కోరారు. ఈ నెల 23న ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వెంకటస్వామి, నరసింహ్మా, ఆశన్న, ఆలీఅక్బర్, మాలిక్ బాష, జయన్న, నూర్ అహ్మద్, నాగన్న తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

ధరూరు : గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు హనుమంతు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో తెలంగాణ ప్రగతి శీల వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, కార్మిక భద్రత కల్పించాలని పేర్కొన్నారు. ఎంపీడీఓ మంజలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, చంద్రాములు ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడిగా శంకరన్న, ఉపాధ్యక్షుడిగా సవారన్న, హనుమంతు, రంగన్న, మహేశ్వరి, బుచ్చన్న తదితరులు ఎన్నియ్యారు. కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోవద్దు


అల్వలపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోవద్దని, భవిష్యత్‌కు పదో తరగతి తొలిమెట్టు లాంటిదని ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని అల్వలపాడు, కోతులదిద్ద, మార్లబీడు తదితర గ్రామాల్లోని పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వార్షిక పరీక్షలకు సమయం దగ్గరపడుతుండడంతో ఎలాంటి ఒత్తిడికి లోను కావొద్దని సూచించారు. పరీక్షలపై ఉన్న సందేహాలు నివృత్తి చేశారు. అలాగే అపార్ ఐడీల ప్రకియ వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యత అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి నైపుణ్యాన్ని ప్రదర్శించాలి


ఉండవెల్లి పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రామకృష్ణ

మల్దకల్/ఉండవెల్లి/ధరూరు: ప్రతి విద్యార్థి చదువుతో పాటు తాను ఎంచుకున్న విభాగంలో నైపుణ్యాన్ని ప్రదర్శించాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ అన్నారు. బుధవారం మల్దకల్ జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ పరిధిలోని విద్యార్థులకు సముదాయ స్థాయి ప్రతిభా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు డ్రాయింగ్, నాటక, స్టోరీ టెల్లింగ్, రైటింగ్, గణిత క్విజ్ వంటి అంశాలపై పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మండల స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ తెలిపారు. అదే విధంగా మాతృభాష దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్పీలు మురళీధర్‌రెడ్డి, హరిప్రియ, కిషోర్‌కుమార్, వెంకటయ్య, పరమన్న ఉపాధ్యాయులు బలరాముడు, రవి, రంగస్వామి, వెంకటేష్, వీరన్న, కిరణ్, గణేష్, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ ఉత్సవాలు..

ఉండవెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభ ఉత్సవాల్లో భాగంగా 9 స్కూలకు చెందిన 36 మంది విద్యార్థులకు ప్రతిభా ఉత్సవాలు ఏర్పాటు చేశారు. ఎంఈఓ రామకృష్ణ విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాలలో కుట్టు మిషన్ల ప్రాక్టికల్స్‌లను ఢిల్లీ నుంచి వచ్చిన భూపేంద్ర సింగ్ పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హేమలత, మునిస్వామి, ఉపాధ్యాయులు గరిబ్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పాఠవ పోటీలు..

ధరూరు మండల పరిధిలోని ఉప్పేరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పాఠవ పోటీలు నిర్వహించారు. ఖమ్మంపాడు, గార్లపాడు, గుడ్డెందొడ్డి, నర్సన్‌దొడ్డి, ద్యాగదొడ్డి, నెట్టెంపాడు పాఠశాలల నుంచి నలుగురు విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చాటారు. అదే విధంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి క్విజ్, పద్య పఠనం పోటీలు నిర్వహించినట్లు జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు గౌరీ శంకర్, సోమశేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రామకృష్ణ, చంద్రశేఖర్, రవి, జగన్ మోహన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భావసార్ క్షత్రియ సమాజ్ అభ్యున్నతికి కృషి

గద్వాలటౌన్: భావసార్ క్షత్రియ సమాజ్ అభ్యున్నతికి పాటుపడతానని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉమేష్ జైతానే అన్నారు. బుధవారం స్థానిక అంబాభవానీ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం జైతానే మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వేలో కులం వద్ద భావసార్ క్షత్రియ సమాజ్ (రంగ్రేజ్) సీరియల్ 100 అని నమోదు చేయాలన్నారు. కులగణన సర్వేలో దర్జీ, మరాఠ, రంగరాజు ఒక్కోలా నమోదు చేయిస్తున్నట్లు తెలిపారు. కులం ఉనికి పోకుండా భావితరాలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గద్వాల అంబాభవానీ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు మనోహర్ మైస్కర్, శ్రీకాంత్ మాలత్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



రాజోళి: రోడ్డు ప్రమాదంలో కర్నూల్ జిల్లాకు చెందిన వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం జరిగింది. కర్నూల్ జిల్లా ఎదురూరు గ్రామానికి చెందిన చాకలి దుబ్బన్న(65) బైక్‌పై శాంతిగనర్‌కు వచ్చి రాజోళి మీదుగా సొంత గ్రామానికి వెళ్తుండగా మండల కేంద్ర శివారులోని భారత్‌మాల రోడ్డు దగ్గరకు వెళ్తుండగా ముండ్లదిన్నె వైపు నుంచి వస్తున్న భారత్‌మాల రోడ్డు పనులకు వినియోగిస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ప్రమాదంలో దుబ్బన్న కాలు నుజ్జునుజ్జయింది. సంఘటనా స్థలంలో బీజేపీ నాయకుడు సంజీవ రెడ్డి ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను అక్కడే నిలబెట్టి, 108కు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం నీరందించడంలో విఫలం



అయిజ: ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగునీరందించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సింధనూరు సమీపంలోని డిస్ట్రిబ్యూటర్ 12 వద్ద బీజేపీ నాయకులు రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడారు. గతంలో ఏప్రిల్ వరకు సాగునీరు పారేవని, ఈ ఏడాది గత 10 రోజుల నుంచి సాగునీరు రావడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను నమ్మి ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు యాసంగి పంటలు సాగు చేశారని, సాగునీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. ఆర్డీఎస్ ఆయకట్టుకు సంపూర్ణంగా సాగునీరు రావాలంటే చిన్నోనిపల్లి రిజర్వాయర్ నుంచి కాలువ ఏర్పాటు చేసి డిస్ట్రిబ్యూటర్ 12 వద్ద లింక్ కలపాలన్నారు. మల్లమ్మ కుంట రిజర్వాయర్‌ను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం చేస్తే బీజేపీ తరఫున నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజ్ గోపాల్, గోపాల కృష్ణ, భగత్ రెడ్డి, నరసింహులు, లక్ష్మణ్ గౌడ్, అశోక్, గోపాల్, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలను ప్రోత్సహించాలి


మల్దకల్ పీహెచ్‌సీలో పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ సిద్ధప్ప

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్యను మరింత పెంచాలని డీఎంహెచ్‌ఓ సిద్దప్ప వైద్యసిబ్బందికి సూచించారు. బుధవారం మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వైద్యసిబ్బంది హాజరు రిజిష్టర్‌తోపాటు రోగులకు సంబంధించిన ఓపీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయాలని,వారు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందనే విషయాలను వివరించాలన్నారు. వైద్యసిబ్బందితోపాటు అన్ని రకాల మందులను రోగులకు అందుబాటులో ఉంచాలని, ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వరూపరాణి, జయమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటస్వామి, నాగేంద్రం, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా అంగన్‌వాడీ కేంద్రాలు


ఆధునికీకరించిన అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభిస్తున్న అధికారులు

గట్టు: చిన్నారులను ఆకట్టుకునేలా అంగన్‌వాడీ కేంద్రం ఆధునీకీకరించడం సంతోషంగా ఉందని ఎంపీడీఓ చెన్నయ్య, మల్దకల్ ప్రాజెక్టు ఇన్‌చార్జ్ సీడీపీఓ నాగరాణి అన్నారు. బుధవారం మండలంలోని గొర్లఖాన్‌దొడ్డిలో ఎల్‌టీఐ మైండ్ ట్రీ, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మరమ్మతులు చేసిన 2, 3 అంగన్‌వాడీ కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. ఆధునీకరించిన అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులను ఆకట్టకునే విధంగా ఆహ్లాదంగా ఉన్నాయన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సౌకర్యంగా తీర్చిదిద్దడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్య, కార్యదర్శి ప్రవీణ్, డీపీఎం ఆనంద్‌కుమార్, భవిష్య భారత్ సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, హరికృష్ణ ,నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, గౌరమ్మ, సుజాతమ్మ, జయమ్మ, సీఓలు పరమేష్, హాలీంపాష, లక్ష్మన్న, వినోద్, ప్రతాప్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీసేందుకు దోహదం


సబ్జెక్ట్ మేళా పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

కేటీదొడ్డి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సబ్జెక్ట్ మేళా ఎంతో ఉపయోగపడుతుందని హెచ్‌ఎం గోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని కొండాపురం పాఠశాలలో ఎంవీ ఫౌండేషన్, మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి సబ్జెక్ట్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు, ఇంగ్లిష్, గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్ట్‌ల వారిగా మూడో తరగతి నుంచి ఐదో తరగతి వరకు వివిధ రకాలైన టీఎల్‌ఎం మెటీరియల్ ప్రదర్శించి వాటి గురించి వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెరుగుందని గోపాల్ అన్నారు. సబ్జెక్ట్ మేళాలలో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై ప్రదర్శించిన మెటీరియల్ తిలకించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషకు గౌరవం ఇవ్వాలి


కొండేరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ అమీర్‌పాష

ఎర్రవల్లి: ప్రతి ఒక్కొ మాతృభాషకు గౌరవం ఇవ్వాలని ఎంఈఓ అమీర్‌పాష అన్నారు. మండల పరిధిలోని కొండేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన మాతృభాష దినోత్సవ కార్యక్రమంలో ఎంఈఓ హాజరై మాట్లాడారు. మన సంస్కృతి, ఆచారాలతో పాటు కుటుంబ పద్ధతులు మాతృభాషతోనే పరిచయం అవుతాయన్నారు. మాతృమూర్తికి ఎంత గౌరవం ఇస్తామో మాతృభాషకు కూడా ప్రతి ఒక్కరూ అంతే గౌరవం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అయిజ: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ తెలుగు టీచర్స్ ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఉత్తనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి తెలుగు ప్రతిభా పోటీలు నిర్వహించారు.

ఇటిక్యాల: మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రెడ్డి నాయక్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సందెరాళ్ల పోటీలు



సందెరాళ్ల పోటీల్లో పాల్గొన్న యువకులు

అయిజ: మండల కేంద్రంలోని తిక్క వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం దొబ్బుడు గుండు, సందెరాళ్ల పోటీలు నిర్వహించారు. సందెరాళ్ల పోటీలో ప్రథమ బహుమతి అయిజ మండలం మేడికొండ గ్రామానికి చెందిన రాజు, ద్వితీయ బహుమతి గట్టు మండలం హిందువాసికి చెందిన నాగరాజు, మూడో బహుమతి మల్దకల్ మండలం తప్పెట్ల మొర్సుకు చెందిన కృష్ణ కైవసం చేసుకున్నారు. గుబ్బల గుండు ఎత్తు పోటీల్లో ప్రథమ బహుమతి రాయచూర్‌కు చెందిన కర్ణ, రెండో బహుమతిని అయిజ మండలానికి చెందిన లాల్ బాషా గెలుచుకున్నారు.

శివాజీ మహరాజ్ దేశానికి గర్వకారణం


ఎర్రవల్లిలో శివాజీ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న యువకులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ దేశానికే గర్వకారణమని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, శంభునాథ్ మఠం యాత్ సభ్యులు, శివాజీ యూత్ సభ్యులు, బీజేపీ నాయకులు తదితరులు పేర్కొన్నారు. బుధవారం శివాజీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రం, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల శోభాయాత్రలు ఘనంగా నిర్వహించారు. శోభాయాత్రల్లో యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జై భవానీ.. వీర శివాజీ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. యువకులు కాషాయ జెండాలు చేతపట్టి ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఫణిమోహన్‌రావు, ధర్మప్రసార సమితి జిల్లా కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, బజరంగ్‌దళ్ నేతలు, సమ సమాజ ట్రస్టు సభ్యులు రాజు, నరసింహ్మా, మాలిక్ బాష, రహమత్, బీజేపీ మండల అధ్యక్షుడు మురళీ కృష్ణ, శాంతినగర్ ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాజారెడ్డి, శివాజీ యూత్ సభ్యులు సాయినాథ్ రెడ్డి, వెంకటన్న, వీరేష్, పారందుస్వామి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జితేందర్ గౌడ్, యువత తదితరులు పాల్గొన్నారు.


బిజ్వారంలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు